www.aksharadarbar.com
శుక్రవారం 20, సెప్టెంబర్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :194 | పేజీలు : 05 | వెల : 05

రేవంత్‌కు రిలీఫ్

- ఓటుకు నోటు కేసులో ముఖ్యమంత్రికి ఊరట
- కేసును వేరే కోర్టుకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పిటిషన్ రిజెక్ట్

05

పండుగ బోనాంజ..

- సింగరేణి కార్మికులకు రేవంత్ సర్కార్ శుభవార్త
- కంపెనీ లాభాల్లో 33శాతం వాటా..
- ఒక్కో ఉద్యోగికి రూ.1.90 లక్షలు బోనస్
- ఒప్పంద కార్మికులు ఒక్కొక్కరికి రూ.5 వేలు ..

05

ఇసుక దోపిడీ!

మానేరు టూ మహా నగరానికి జీరో సాండ్

- భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల సరిహద్దులో ఇసుక అక్రమ దందా
- క్వారీల్లో యార్డు వద్ద గాకుండా నేరుగా మానేరులోనే ఇసుక లోడింగ్
- మూడు నాలుగు క్వారీల నుంచి నిత్యం సుమారు 300 లారీల ద్వారా ఇసుక తరలింపు
- వేబిల్లు లేకుండా హైదరాబాద్ కు అక్రమంగా చేరుతున్న ఇసుక
- ప్రతిరోజు దాదాపు రూ.కోటి గడిస్తున్న క్వారీల అక్రమార్కులు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి
- తాజాగా లారీల పట్టివేతతో వెలుగులోకి వచ్చిన జీరో బాగోతం

భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల సరిహద్దులోని మానేరు నదిలో ఇసుక దోపిడీ జరుగుతోంది. కొద్ది రోజుల నుంచి అక్రమార్కులు దర్జాగా ఈ దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం. క్వారీల స్టాక్ యార్డుల వద్ద కాకుండా నేరుగా మానేరులోనే ఇసుకను తోడి అక్రమంగా విక్రయిస్తున్నట్లు తెలిసింది. తద్వారా అక్రమార్కులు ప్రతిరోజు సుమారు రూ.కోటి ఆదాయాన్ని గడిస్తూ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నట్లు సమాచారం. నేరుగా మానేరు నదిలో జీరో ఇసుక లోడ్ అవుతున్నలారీలు ఇక్కడి నుంచి హైదరాబాద్ దారి పడుతున్నట్లు తెలిసింది. ఇలా మూడు నాలుగు క్వారీల నుంచి నిత్యం దాదాపు 300 లారీల ద్వారా వేల టన్నుల ఇసుక వే బిల్లులు లేకుండా రాష్ట్ర రాజధానికి అక్రమంగా చేరుతున్నట్లు సమాచారం. అడ్డుకోవాల్సిన అధికారులు అవగాహనతో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గురువారం రాత్రి మార్గమధ్యంలో అనూహ్యంగా ఓ పోలీస్ స్టేషన్ కు చెందిన అధికారులు రిపేర్ తో ఆగిన ఓ లారీ డ్రైవర్ ను వే బిల్లు కోసం ప్రశ్నించగా జీరో ఇసుక అక్రమ రవాణా బాగోతం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ సమయంలో జీరో ఇసుక లోడుతో వెళ్తున్న మరో పది లారీలను కూడా పట్టుకున్నట్లు తెలిసింది. సంచలనం రేపిన ఈ వ్యవహారం మరోసారి జీరో ఇసుక బిజినెస్ ను బయటపెట్టింది. - అక్షరదర్బార్, నిఘావిభాగం

02

గంజాయి స్మగ్లర్ అరెస్ట్

- రూ. 85 లక్షల విలువ గల 338 కిలోల గంజాయి పట్టివేత
- పరారీలో మరో ఇద్దరు నిందితులు

04

ఎంజీఎం ఆస్పత్రికి అత్యాధునిక పరికరాలు

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద

05

అయ్యో తల్లీ..



- వరకట్న వేధింపులకు తల్లీకూతుళ్లు బలి
- ఈనెల 18న గడ్డిమందు తాగిన గర్భిణి
- దవాఖానకు తరలించిన బంధువులు
- హాస్పిటల్‌లోనే చిన్నారికి జన్మనిచ్చిన తల్లి..
- వైద్యుల సూచన మేరకు ఎంజీఎంలో చికిత్స..
- నిన్న శిశువు.. నేడు వరంగల్‌లోని ప్రైవేట్ దవాఖానలో తల్లి కన్నుమూత

02

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

- భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల సరిహద్దులో ఇసుక అక్రమ దందా
- క్వారీల్లో యార్డు వద్ద గాకుండా నేరుగా మానేరులోనే ఇసుక లోడింగ్
- మూడు నాలుగు క్వారీల నుంచి నిత్యం సుమారు 300 లారీల ద్వారా ఇసుక తరలింపు
- వేబిల్లు లేకుండా హైదరాబాద్ కు అక్రమంగా చేరుతున్న ఇసుక
- ప్రతిరోజు దాదాపు రూ.కోటి గడిస్తున్న క్వారీల అక్రమార్కులు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి
- తాజాగా లారీల పట్టివేతతో వెలుగులోకి వచ్చిన జీరో బాగోతం

ఇసుక దోపిడీ!

మానేరు టూ మహానగరానికి జీరో సాండ్

అక్షరదర్బార్, నిఘావిభాగం :

భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల సరిహద్దులోని మానేరు నదిలో ఇసుక దోపిడీ జరుగుతుంది. కొద్ది రోజుల నుంచి అక్రమార్కులు దర్జాగా ఈ దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం. క్వారీల స్టాక్ యార్డుల వద్ద కాకుండా నేరుగా మానేరులోనే ఇసుకను తోడి అక్రమంగా విక్రయిస్తున్నట్లు తెలిసింది. తద్వారా అక్రమార్కులు ప్రతిరోజు సుమారు రూ.కోటి ఆదాయాన్ని గడిస్తూ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నట్లు సమాచారం. నేరుగా మానేరు నదిలో జీరో ఇసుక లోడ్ అవుతున్న లారీలు ఇక్కడి నుంచి హైదరాబాద్ దారి పడుతున్నట్లు తెలిసింది. ఇలా మూడు నాలుగు క్వారీల నుంచి నిత్యం దాదాపు 300 లారీల ద్వారా వేల టన్నుల ఇసుక వే బిల్లులు లేకుండా రాష్ట్ర రాజధానికి అక్రమంగా చేరుతున్నట్లు సమాచారం. అడ్డుకోవాల్సిన అధికారులు అవగాహనతో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గురువారం రాత్రి మార్గమధ్యంలో అనూహ్యంగా ఓ పోలీస్ స్టేషన్ కు చెందిన అధికారులు రిపేర్ తో ఆగిన ఓ లారీ డ్రైవర్ ను వే బిల్లు కోసం ప్రశ్నించగా జీరో ఇసుక అక్రమ రవాణా బాగోతం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ సమయంలో జీరో ఇసుక లోడుతో వెళ్తున్న మరో పది లారీలను కూడా పట్టుకున్నట్లు తెలిసింది. సంచలనం రేపిన ఈ వ్యవహారం మరోసారి జీరో ఇసుక బిజినెస్ ను బయటపెట్టింది.

వేబిల్లు లేకుండా రవాణా

టీఎస్ ఎండీసీ ద్వారా ఆన్ లైన్ లో తమకు అవసరమైనంత ఇసుక లభించకపోతుండటం వల్ల లారీల యజమానులు జీరో దందా నిర్వహిస్తున్న అక్రమార్కులను సంప్రదిస్తున్నట్లు తెలిసింది. హైదరాబాద్ కు చెందిన లారీల యజమాలతోనే అక్రమార్కులు ఈ దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం. మానేరు నదిలో అక్రమంగా లోడు చేసుకుంటున్న ఇసుకతో లారీల యజమానులు వే బిల్లులు లేకుండా నేరుగా హైదరాబాద్ మహా నగరానికి చేరుకుంటున్నట్లు తెలిసింది. పది రోజుల నుంచి జరుగుతున్న ఈ భాగోతం గురువారం రాత్రి అనూహ్యంగా బయటపడింది. మార్గమధ్యంలో పెద్దపల్లి జిల్లాలోని ఓ పోలీసు స్టేషన్ పరిధిలో జీరో ఇసుకతో ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళుతున్న లారీ ఒకటి టైరు పేలటం వల్ల ఆగిపోయినట్లు తెలిసింది. స్థానిక పోలీసులు ఈ లారీ డ్రైవర్ ను ఇసుక వే బిల్లు విషయమై అడుగగా వ్యవహారం మొత్తం బయటపడినట్లు సమాచారం. లారీ డ్రైవర్ వద్ద వేబిల్లు లేకపోవడంతో జీరో ఇసుకగా గుర్తించిన పోలీసులు విచారణలో తమకు అందిన సమాచారం మేరకు ఆ సమయంలో వే బిల్లు లేకుండా హైదరాబాద్ వెళుతున్న మరో 10 లారీలను కూడా పట్టుకుని మొత్తం 11 లారీలను స్టేషన్ కు తరలించినట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం ఇది వెలుగులోకి రావడంతో వ్యవహారమంతా బయటపడినట్లు తెలిసింది . మానేరు నదిలో అక్రమంగా ఇసుక దందా చేపట్టిన అక్రమార్కులకు టీఎస్ఎండీసీ అధికారుల హెల్ప్ కూడా ఉందా?, ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందనే కోణంలో ప్రభుత్వ నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఇది ఇసుక ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది.

- మానేరులోనే లోడింగ్

భారీ వర్షాలు, వరదలతో పాటు వివిధ కారణాలవల్ల ఇటీవలి కాలంగా మార్కెట్ లో ఇసుక కొరత తలెత్తింది. టీఎస్ ఎండీసీ ద్వారా ఆన్ లైన్ లో కొనుగోలుదారులకు అవసరమైనంత ఇసుక లభించడం లేదు. దీంతో ఇసుక మాఫియా జీరో దందాకు తెర లేపింది. ఇసుకను రవాణా చేసే లారీల యజమానులతో టచ్ లోకి వెళ్లి ఇసుక అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా భూపాలపల్లి జిల్లాలోని మల్హర్, పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలాల సరిహద్దులో గల మానేరు నదిలో జీరో దందా మొదలైంది. ఇక్కడ సుమారు పది రోజుల నుంచి మూడు నాలుగు క్వారీల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసింది. టీఎస్ఎండిసి క్వారీల్లో స్టాక్ యార్డుల వద్ద కాకుండా నేరుగా మానేరు నదిలోనే అక్రమార్కులు ఇసుకను తోడి లారీల్లో లోడ్ చేస్తున్నట్లు సమాచారం. ఇలా ప్రతిరోజు దాదాపు 300 లారీల ద్వారా... ఒక్కో లారీలో 50 నుంచి 60 టన్నుల చొప్పున దాదాపు 15 వేల టన్నులకు పైగా ఇసుక ఈ మూడు నాలుగు క్వారీల నుంచి అక్రమంగా తరలిపోతున్నట్లు సమాచారం. ఈ క్వారీల వద్ద నిర్వాహకులు ఒక్కో లారీలో ఇసుకను అక్రమంగా లోడు చేసినందుకు టన్నుకు సన్న ఇసుకకు రూ.38 వేలు, దొడ్డు ఇసుకకు రూ.26 వేల చొప్పున తీసుకుంటున్నట్లు తెలిసింది.

వరకట్న వేధింపులకు తల్లీకూతురు బలి

- ఈనెల 18న గడ్డిమందు తాగిన గర్భిణి
- దవాఖానకు తరలించిన బంధువులు
- హాస్పిటల్‌లోనే చిన్నారికి జన్మనిచ్చిన తల్లి..
- వైద్యుల సూచన మేరకు ఎంజీఎంలో చికిత్స..
- నిన్న శిశువు.. నేడు తల్లి కన్నుమూత

అక్షరదర్బార్, నర్సంపేట : వరకట్న వేధింపులకు తల్లీకూతరు బలైంది. భర్త, అత్త వేధింపులు తాళలేక ఇద్దరూ తనువు చాలించారు. ఈ విషాధ ఘటన దుగ్గొండి మండలం దేశాయ్‌పల్లిలో చోటుచేసుకుంది. దుగ్గొండి ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం... దేశాయ్‌పల్లి గ్రామానికి చెందిన పొదురుకోళ్ల ప్రవళిక (22)కు మూడు సంవత్సరాల క్రితం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముదురుకోళ్ల సందీప్‌తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. వివాహం జరిగిన సంవత్సరం నుండి మృతురాలి భర్త సందీప్, అత్త విజయ రూ. 10 లక్షల కట్నం, రెండెకరాల పొలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రవళికను మానసికంగా హింసిస్తున్నారు. పలుమార్లు పెద్దమనుషులు పంచాయతీ నిర్వహించి సర్దిచెప్పినా వినకుండా వేధింపులకు గురి చేస్తున్నారు. 8 నెలల గర్భవతి అయిన ప్రవళికను నెలరోజుల క్రితం కట్నం తెమ్మని పుట్టింటికి పంపారు. అప్పటి నుండి తీసుకపోకుండా పుట్టింటి వద్దనే ఉంచారు. ఈక్రమంలోనే ఈనెల 18న ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ప్రవళిక గడ్డి మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు వరంగల్ లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యుల సలహా మేరకు ఆపరేషన్ చేసి బేబీని బయటికి తీయగా ప్రాణాలతో ఉండటంతో ఎంజీఎంలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి 19న చిన్నారి మరణించగా, చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం ప్రవళిక చనిపోయింది. తల్లీకూతురు చావుకు భర్త సందీప్, అత్త విజయ కారణమని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. వారిపై కఠని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దుగ్గొండి ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

మద్యం మత్తులో ఎలుకల మందు తాగి వ్యక్తి మృతి...

అక్షర దర్బార్, కేసముద్రం: మద్యం మత్తులో ఎలుకల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంకాల రాము (21) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం మద్యం సేవించి ఆ మత్తులో ఎలుకల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మురళిధర్ రాజ్ తెలిపారు.

సమస్యలు లేని వార్డుగా తీర్చిదిద్దుతాం..

కౌన్సిలర్ పేర్ల యమునా జంపన్న

అక్షర దర్బార్,తొర్రూరు: తొర్రూరు మున్సిపాలిటీలో నాలుగో వార్డును సమస్యలు లేని వార్డుగా తీర్చిదిద్దుతానని కౌన్సిలర్ పేర్ల యమునా జంపన్న తెలిపారు. శుక్రవారం వార్డులో రాజీవ్ నగర్ తొమ్మిదో నెంబర్ లైన్ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్లు తూర్పాటి సంగీత రవి, నర్మెటి గజానంద్, స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు చర్లపల్లి వెంకటరమణ, తూర్పాటి మదర్, తూర్పాటి శ్రీను, విజయ్, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించండి : ఎంపీడీవో

అక్షర దర్బార్ మల్హర్ : గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని ఎంపిడిఓ శ్యామ్ సుందర్ కోరారు. శుక్రవారం తాడిచెర్ల మండలపరిషత్ కార్యాలయంలో తాజా మాజీ ఎంపిపి చింతలపల్లి మలహల్ రావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ.. ఈనెల 13న గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేశామని తెలిపారు. ఇందులో అభ్యంతరాలు, నూతన ఓటర్ల దరఖాస్తులను 21లోపు బిఎల్ఓలకు లిఖితపూర్వకంగా సమర్పించాలని చెప్పారు. 26లోగా అభ్యంతరాలను పరిష్కరించి 28న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. ఒక కుటుంబంలో సభ్యులందరికీ ఒకే వార్డులో ఓట్లు ఉండేలా కార్యాచరణ రూపొందించినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు బడితేల రాజయ్య, రాఘవ రెడ్డి, ముడుతనపల్లి ప్రభాకర్, నాగరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి తోటకూరి పరామర్శ

అక్షర దర్బార్,తొర్రూరు,పెద్దవంగర: మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన చింత వెంకటమ్మ (70) అకాల మరణం చెందగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు తోటకూరి శ్రీనివాస్ వారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా తోటకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ..కుటుంబంలో పెద్దదిక్కు కోల్పోయినందుకు ఎలాంటి ఆందోళన చెందవద్దని, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు.

దళితబంధు పేరుతో
బడా మోసం..

- దళిత బంధు ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేసిన తాజామాజీ సర్పంచ్
- గొర్రెలను అమ్మి రూ.70వేలు అప్పజెప్పిన దళిత కాపరి
- ఉన్న ఉపాధి కోల్పోయి రోడ్డున పడిన బాధితుడు
- న్యాయం చేయాలని ప్రభుత్వానికి వేడుకోలు

అక్షర దర్బార్, కేసముద్రం:

దళితుల జీవితాల్లో వెలుగులు నింపాలని,దళితుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా దళితబంధు పథకాన్ని తీసుకొచ్చింది.అయితే రాష్ట్రస్థాయిలో అమలు విషయం పక్కన పెడితే.. దళితబంధు పేరు చెప్పి.. దళారులు మాత్రం పోగు చేసుకున్న సొమ్ముకు లెక్కేలేదు.బడా నేతలు తెలుసని చెప్పి.. పెద్దమొత్తంలో ఆయా నేతలు అమాయకుల వద్ద నగదును దొరికినకాడికి దోచుకున్నారు.లబ్ధిదారులకు పదిలక్షల రూపాయలు వస్తాయని ఆశచూపి.. ఉపాధి పొందుతున్న వనరులను సైతం అమ్ముకొని లంచాలు ఇస్తే.. ఆకరికి దళిత బంధు వచ్చుడు దేవుడెరుగు.. ఉన్న ఉపాధి కూడా పోయి.. రోడ్డున పడే పరిస్థితి వచ్చింది.ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఓ గ్రామపంచాయతీలో ఆలస్యంగా వెలుగు చూసింది...

కేసముద్రం మండలంలోని ఓ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి దళితబంధుకు ఆశపడ్డాడు.తన పని తాను చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తరుణంలో..నీకు దళిత బంధు వస్తుందని అప్పటి సర్పంచ్ దళితబంధు ఇప్పిస్తామని ఓ అమాయక దళితుడిని నమ్మించాడు.రెండు లక్షల రూపాయలు ముందుగా ఖర్చు చేయాలని,లేదంటే వేరే వాల్లు పైసలతో సిద్ధంగా ఉన్నారని సర్పంచ్ గట్టిగానే వారించాడు.దీంతో ఆ పేద బిడ్డ రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి నాదని చెప్పుకొచ్చాడు.పైసలు పెట్టక పోతే లబ్ధిపోందనేమోనన్న భయంతో తన ఉపాధికి ఆసరాగా నిలిచిన గొర్రెలను అమ్మి ఆ మాజీ సర్పంచ్ కి అడిగిన నగదును అప్పజెప్పాడు.ఇలా రెండు దఫాలుగా మొత్తం రూ. 70వేల వరకు అప్పజెప్పినట్లు బాధితుడు చెప్తున్నాడు.ఇక్కడ వరకు బాగానే ఉన్నా.. నగదు కాజేసిన మాజీ సర్పంచ్.. గొర్రెల కాపరికి దళిత బంధు ఇప్పించడంలో విఫలమయ్యాడు.దళితబంధు ఇవ్వక పోగా.. ఆ అమాయక దళితుడిని నువ్వు ఎక్కడ చెప్పు కుంటావో చెప్పుకోపో అంటూ ఇతరత్రా మాటలతో దూషించిన పరిస్థితి. దీంతో.. బాధితుడు.. అటు గొర్రెలు పోయి.. ఉపాధి లేక.. ఇటు దళితబంధు రాక.. నట్టేటా మునిగిన పరిస్థితి....

- బోరున విలపిస్తున్న బాధితుడు

మాజీ సర్పంచ్ చేతిలో మోసపోయిన తనకు న్యాయం కావాలని ఆ బాధితుడు కోరుతున్నాడు.నమ్మించి మోసం చేశారని ఇలా ఎంతో మంది అమాయకులను మాజీ సర్పంచ్ దగా చేశాడని అంటున్నాడు.గత పాలనపై సమగ్ర విచారణ చేస్తే.. ఎన్నోకొత్త విషయాలు వెలుగులోకి వస్తాయని,బాధితులందరూ రోడ్డుపైకి వస్తారని చెప్తున్నాడు.జీవన ఉపాధిగా ఉన్న గొర్లు సైతం పోయి.. ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నానని అంటున్నాడు.తన కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బ తీసిన మాజీ తాజా సర్పంచ్ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాడు...

-కేసముద్రంలో ఇలాంటి ఘటనలు ఎన్నో..

మండలంలో ఈ ఘటనే కాక.. అనేక మంది దళిత బంధు బాధితులు ఇలాంటి దళారుల చేతిలో మోసపోయారని తెలుస్తోంది.అనేకమంది పేదబిడ్డల వద్ద.. ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామని చెప్పి నగదు పోగు చేసుకున్నారని విశ్వసనీయ సమాచారం. బాధితులంతా.. రోడ్డుపైకి వస్తే తప్ప.. దళారుల వ్యవహారం బయటపడదు.ఇదంతా అధికారుల కనుసన్నులోనే జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికైనా ఇలాంటి బాధితులకు అధికారులు ఏమేరకు న్యాయం చేస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.మరి బాధిత గొర్రెల కాపరికి న్యాయం జరుగుతుందా లేదా వేచి చూడాలి...మరో సంచికతో మీ ముందుకు....

రమణ ఎంపిక పట్ల హర్షం

అక్షర దర్బార్, భూపాలపల్లి : ఐజేయూ అనుబంధ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) జర్నలిస్ట్ హౌసింగ్, వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గా వల్లాల వెంకటరమణను నియమించడం పట్ల భూపాలపల్లి జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ పక్షాన అభినందనలు తెలుపుతున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్యాతం సతీష్, సామంతుల శ్యామ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ.. శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన రమణ మూడు దశాబ్దాలకుపైగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న ఆయన రాష్ట్ర కన్వీనర్ గా నియమించడం పట్ల మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, ఇతర యూనియన్ పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతున్నమన్నారు. కార్యక్రమంలో ఐజేయు రాష్ట్ర హెల్త్ కమిటీ మెంబర్ సామల శ్రీనివాస్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏటా వీరభద్ర స్వామి, కోశాధికారి చింతల కుమార్ యాదవ్, ఐజేయు అనుబంధం జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష,కార్యదర్శులు సాంబయ్య, రమేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలి

అక్షర దర్బార్, భూపాలపల్లి: తెలంగాణ రాష్ట్రంలో సుపరిపాలన అందించాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ జన్నె మొగిలి, రూరల్ ఇన్చార్జ్ దొంగల రాజేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో రూరల్ కన్వీనర్ విప్లవ కుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్, టిడిపి, టీఆర్ఎస్ పార్టీలు అధికారాన్ని చేపట్టి రాష్ట్ర ప్రజలను ఓటు బ్యాంకు రాజకీయాలతో మోసం చేశాయని ఉచిత పథకాల పేరుతో అధికారంలోకి వస్తూ రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా బీజేపీ సభ్యత్వం తీసుకొని ప్రజలకు సేవ చేసే దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివరాత్రి వేణు, రెంటలలో విప్లవ కుమార్ రెడ్డి రవి రాజ మామిడి చెట్టు స్వామి తుమ్మేటి దామోదర్ రెడ్డి, దారూరి మహేందర్, జంజర్ల సురేష్, శ్రీను పాల్గొన్నారు.

గోదావరి తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ రామచంద్రరావు

మావోయిస్టులకు సహకరించొద్దు

మహాదేవపూర్ సీఐ రామచంద్రరావు

అక్షర దర్బార్,మహాదేవపూర్: అటవీ గ్రామాలు గోదావరి తీర ప్రాంత ప్రజలు మావోయిస్టులకు సహకరించవద్దని మహాదేవపూర్ సీఐ రామచంద్ర రావు అన్నారు. నేటి నుండి మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవాలు ప్రారంభమవుతుండటంతో ముందు జాగ్రత్త చర్యగా సీఐ ఆధ్వర్యంలో పలిమెల మండలంలోని అటవీ గ్రామాల్లో, గోదావరి తీర ప్రాంతాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పొరుగునే ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ నుండి మావోయిస్టులు గోదావరి నది దాటడానికి ఎవరు సహకరించవద్దని సూచించారు. మండలంలోని సర్వాయిపేట, దమ్మూరు, బూరుగు గూడెం, నీలంపల్లి, బోడాయి గూడెం, ముకునూరు గ్రామాల ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలిమెల ఎస్సై తమాషా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతిని కలిసిన ఆరె సంఘం నాయకులు

అక్షర దర్బార్, దుగ్గొండి : నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డిని ఆరె సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆరె కార్పొరేషన్ ఏర్పాటుకు తమ వంతు సహకారం అందించి కృషి చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే మాధవ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపెల్లి శివాజీ,రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్,వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇంగ్లె శివాజీ, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే శివాజీ,నర్సంపేట మార్కెట్ డైరెక్టర్ హింగే

ఎమ్మెల్యేను కలిసిన ఆరెకుల సంఘం నాయకులు

రామారావు, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు వలిగే నర్సింగారావు,జిల్లా నాయకులు ద్యాగం శివాజీ, బాబురావు, కరాబు రాజేశ్వరరావు,కుడ్లే మనోహర్ రావు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులు, సంస్థలకు పురస్కారాలు

అక్షర దర్బార్, భూపాలపల్లి: జిల్లాలో విశిష్ట సేవలందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలను అందజేస్తున్నట్లు రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు తెలిపారు. వయో వృద్ధుల సంక్షేమం కోసం ఏదేని సంస్థలో పని చేసిన వారు, వారి అర్హతలని బట్టి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు సెప్టెంబర్ 25న జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య తెలిపారు. ఇతర వివరాలకు 9652311804 ను సంప్రదించాలని కోరారు.

లక్ష్మారెడ్డిపల్లిలో కళాకారులకు సన్మానం

అక్షర దర్బార్, గణపురం: రాష్ట్ర స్థాయి సంగీత విభావరి పోటీల్లో ఉత్తమ గాయకులుగా ఎంపికైన గణపురం మండలం లక్ష్మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన మేడిపల్లి రాజుగౌడ్, మేడిపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ను శక్రవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేడిపల్లి రాజు గౌడ్ మాట్లాడుతూ.. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఒద్దుల విజయ అశోక్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మొలుగురి రాజు, గడ్డం పున్నం చందర్, వీరమల్ల వీరారెడ్డి, ఒద్దుల శ్రీకాంత్ రెడ్డి, కూచన రవీందర్, సాదు స్వప్న-చంద్రయ్య, సరోజన-సారయ్య, సుశీలగౌడ్, మామిడాల విజయ్, బాలు, వినోద్ మేడిపల్లి సతీష్ గౌడ్ ఓంకార్ గౌడ్, ఓంకార్ గౌడ్, మేడిపల్లి శ్యాంసుందర్ గౌడ్, ఓరుగంటి

కళాకారులను సన్మినిస్తున్న గ్రామస్తులు

కుమార్ రాకేష్, మొలుగురి ఆనంద్, ఎడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణం వద్ద వివరిస్తున్న కార్యదర్శి

ప్లాస్టిక్ ను నిషేధించాలి

అక్షర దర్బార్, మహాదేవపూర్: ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని మహాదేవపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి కల్పన పిలుపునిచ్చారు. స్వచ్ఛహి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని కిరాణా షాపులు, మాంసం దుఖానాల వద్దకు వెళ్లి ప్రజలకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న రంజిత్ రెడ్డి

వాటర్ ప్లాంట్ ప్రారంభం

నెక్కొండ అక్షర దర్బార్ : మండలంలోని దీక్షకుంట గ్రామానికి చెందిన మేరుగు శివ తస సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, చల్ల పాపిరెడ్డి మేర్గు విజయ్ మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి దీక్షకుంట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మెర్గు కుమార్ స్వామి నాయకులు పులి నవీన్ రాంబబు మడుగురి రమేష్ బుడిగే రాజు LCI ఏజెంట్ పులి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు..

- హర్షం వ్యక్తం చేసిన రైతులు

అక్షర దర్బార్, కేసముద్రం: విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్లు వరదలతో దెబ్బతిని విద్యుత్ సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ట్రాన్స్కో ఉన్నతాధికారులకు నివేదించారు.ఈ నేపథ్యంలో కేసముద్రం మండలంలో మూడు చోట్ల దెబ్బతిన్న విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు.మరో మూడు చోట్ల శనివారం ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.సమస్యపై స్పందించి వెంటనే పరిష్కారం చూపిన ఎమ్మెల్యేకు రైతులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

యూజీడీ డీపీఆర్ రూపొందించండి

- నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం కన్సల్టెంట్లకు ఆహ్వానం
- ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు పనులు జరగాలి
- నగర మేయర్ గుండు సుధారాణి

మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

అక్షరదర్బార్, హన్మకొండ: వరంగల్ మహానగరంలో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ వరదనీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు కోసం డీపీఆర్ రూపొందించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వరదనీటి పారుదల నీటి సరఫరా వ్యవస్థ సమగ్ర మాస్టర్ ప్లాన్ పై బెంగళూరుకు చెందిన శుభ్ కన్సల్టెన్సీ ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ సుధారాణి పాల్గొన్నారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ ... హైదరాబాద్ తర్వాత రెండవ అతిపెద్ద మహా నగరమైన వరంగల్ సమగ్ర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి బహుముఖ వ్యూహాలను అమలు చేస్తున్నారని అన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కన్సల్టెంట్లను ఆహ్వానించామన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసినపుడే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సఫలం అవుతుందన్నారు. ఆయా విభాగాలు భాగస్వామ్యమై వారి సూచనలు సలహాలు పరిగణలోకి తీసుకోవడం ద్వారా సర్వే కోసం క్షేత్ర స్థాయిలోకి వెళ్ళినపుడు సమస్య సులభంగా అవగతం అవుతుందని అన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ సహకారంతో ముందుకెళితే భూసేకరణ వంటి అంశాల్లో ఇబ్బందులు ఉండవని అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు వేల కోట్ల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యు జీ డి) ఏర్పాటు జరగాలని, స్మార్ట్ సిటీ ద్వారా కొత్త రోడ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, కేవలం ప్రాథమిక స్థాయిలో సంబంధిత అధికారుల కు భూగర్భ డ్రైనేజీ, వరద నీటి పారుదల పై అవగాహన కోసం మాత్రమే ఈ సమావేశం నిర్వహించామన్నారు. పూర్తి స్థాయిలో ఉన్నతాధికారులు స్టెక్ హోల్డర్స్ ను భాగస్వామ్యం చేస్తూ త్వరలో విస్తృత స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ తెలిపారు. శుభ్ కన్సల్టెన్సీ కి చెందిన ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నగరంలో చేపట్టబోయే సర్వే, అంశాలను గురించి కూలంకషంగా వివరించారు.

గంజాయి స్మగ్లర్ అరెస్ట్

- రూ. 85 లక్షల విలువ గల 338 కిలోల గంజాయి పట్టివేత
- పరారీలో మరో ఇద్దరు నిందితులు

అక్షరదర్బార్, హన్మకొండ: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని హసన్‌పర్తి తోపాటు తెలంగాణ యాంటీ డ్రగ్స్ వరంగల్ విభాగం పోలీసులు సంయుక్తంగా ఆరెస్టు చేశారు. నిందితుడి నుండి పోలీసులు సుమారు రూ. 85 లక్షల విలువ గల 338 కిలోల గంజాయితోపాటు గంజాయిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలను వెల్లడించారు. ఏపీలోని అల్లూరి జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ ఈనెల 17న ఒడిషా చిత్రకొండ మండలానికి నలుగురు వద్ద 338 కిలోల గంజాయిని 96 ప్యాకేట్లుగా మార్చి, ట్రాక్టర్ ట్రాలీ అడుగు భాగంలో డబ్బాను ఏర్పాటు చేసిన అందులో భద్రపర్చారు. వాటిని ట్రాక్టర్లో కామారెడ్డి జిల్లా బికనూర్ మండలానికి చెరవేసే క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. హసన్‌పర్తి ఎస్సై దేవేందర్‌రెడ్డి అనంతర సాగర్ క్రాస్ రోడ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా దొరికిపోయారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. నిందితుడుకి గంజాయి తీసుకరమ్మని చెప్పిన వ్యక్తి తోపాటు గంజాయిని అందజేసిన వ్యక్తులు ఇరువురు ప్రస్తుతం పరారీలో వున్నారు. గంజాయిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ యాంటీ డ్రగ్స్ వరంగల్ విభాగం ఏసీపీ సైదులు, కాజీపేట ఏసీపీ తిరుమల్, తెలంగాణ యాంటీ డ్రగ్స్ వరంగల్ విభాగం ఇన్స్ స్పెక్టర్ సురేష్, హసన్ పర్తి సీఐ చేరాలు, ఎస్సై దేవేందర్, రవితోపాటు ఇతర పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు. ఈ మీడియా సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, నందిరాం నాయక్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

చిన్నారిని ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

చిన్నారులకు ఎమ్మెల్యే దొంతి ఆశీర్వాదాలు

అక్షర దర్బార్, నర్సంపేట : మండలంలోని మగ్ధుంపురం గ్రామానికి చెందిన గాన్నోజు హరిసిత–ప్రవీణ్ దంపతుల కుమారుడు గాన్నోజు మోక్షిత్, రాజపల్లి గ్రామానికి చెందిన ఆడెపు అపర్ణ–సతీష్ దంపతుల కుమారుడు ఆడెపు యువన్ తేజ మొదటి పుట్టినరోజు వేడుకలకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట టిపిసిసి సభ్యుడు రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీలో లీడర్ వేముల సాంబయ్య గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బానోతు లక్ష్మణ్ నాయక్ , తుమ్మలపల్లి సందీప్ ఉన్నారు.

విద్యార్థులతో ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి పోటీలకు సన్ వ్యాలీ విద్యార్థులు

అక్షర దర్బార్, భూపాలపల్లి: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19న మండల స్థాయిలో జరిగిన అండర్ 14 ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, అండర్–17 ఖోఖో, కబడ్డీ విభాగాల్లో భూపాలపల్లి జిల్లా కేంద్రం పుల్లూరి రామయ్య పల్లి పరిధిలోని సన్ వ్యాలీ హైస్కూల్ కు చెందిన 17మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మైనాల సురేష్, ప్రిన్సిపాల్ మీనం సతీష్ తెలిపారు.

సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న కౌన్సిలర్ మొగిలి

లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాల అందజేత

అక్షర దర్బార్, పరకాల : తెలంగాణలోని గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ హామీని అమలు లో భాగంగా పరకాల విలీన గ్రామమైన ఆరో వార్డు రాజపేటలో సబ్సిడీ వచ్చిన వారికి వారి సబ్సిడీ పత్రాలను స్థానిక ఆరో వార్డు కౌన్సిలర్ దామెర మొగిలి అందించారు.

పండుగ బొనాంజ..

- సింగరేణి కార్మికులకు రేవంత్ సర్కార్ శుభవార్త
- కంపెనీ లాభాల్లో 33శాతం వాటా..
- ఒక్కో ఉద్యోగికీ రూ.1.90 లక్షలు బోనస్
- ఒప్పంద కార్మికులు రూ.5 వేలు..

అక్షరదర్బార్, హైదరాబాద్: సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. 2023-24 ఏడాదిలో సింగరేణి సంస్థకు రూ.4,701 కోట్లు లాభాలు రాగా, అందులో నుంచి 33 శాతం లాభాలను బోనస్గా ప్రకటిస్తున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ నిర్ణయంతో ఒక్కో సింగరేణి కార్మికుడికి సగటున రూ.1.90 లక్షలు బోనస్గా అందనుంది. గతేడాది కంటే రూ.20 వేలు అదనంగా సింగరేణి కార్మికులకు బోనస్గా అందింది. అలాగే సింగరేణి చరిత్రలోనే తొలిసారిగా ఒప్పంద ఉద్యోగులకూ బోనస్ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఒప్పంద కార్మికులు ఒక్కొక్కరికీ రూ.5 వేలు బోనస్ ఇవ్వనుంది. 2023-24 ఏడాదిలో సింగరేణి లాభం రూ.4,701 కోట్లు కాగా, ఆ లాభాల్లో 33 శాతాన్ని ప్రభుత్వం బోనస్గా ప్రకటించింది. శుక్రవారం సచివాలయంలో సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి.. సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ క్రమంలోనే.. సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించారు. ఏటా దసరా పండగ కు ఇచ్చే బోనస్ ను గతంలో కంటే ఒక్కొక్కరికి 20 వేలు పెంచుతూ పండగకు ముందే ఇవ్వాలని నిర్ణయించారు.

సింగరేణి లాభం రూ.4,701 కోట్లు..

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 'సింగరేణి రాష్ట్రానికే తలమానికమైన సంస్థ. 2023-24 ఏడాదిలో సింగరేణి లాభం రూ.4,701 కోట్లు. సింగరేణి కార్మికులకు సంతోషంగా బోనస్ ప్రకటిస్తున్నాం. సింగరేణి కార్మికులకు రూ.796 కోట్లు బోనస్గా ప్రకటిస్తున్నాం. ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.90 లక్షలు బోనస్ వస్తుంది. సింగరేణిలో శాశ్వత ఉద్యోగులు 41,837. సింగరేణిలో ఒప్పంద ఉద్యోగులకు కూడా బోనస్ ఇవ్వాలని నిర్ణయించాం. సింగరేణి ఒప్పంద ఉద్యోగులకు ఒకొక్కరికి రూ.5 వేల బోనస్ ఇవ్వనున్నాం. సింగరేణి చరిత్రలో తొలిసారిగా ఒప్పంద ఉద్యోగులకూ బోనస్ ఇస్తున్నాం.' అని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో సింగరేణి కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జానీ మాస్టర్‌కు రిమాండ్

- 16 ఏళ్ల వయసులోనే బాధితురాలిపై లైంగిక దాడి
- దురుద్దేశంతోనే అసిస్టెంట్ గా చేర్చుకున్నారు
- రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు

అక్షరదర్బార్, హైదరాబాద్ : ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ వ్యవహారం అటు టాలీవుడ్‌తోపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. గోవాలో జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్ తీసుకొచ్చిన సైబరాబాద్ పోలీసులు శుక్రవారం జానీని ఉప్పరపల్లి కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో జానీ మాస్టర్‌కు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్‌ను విధించింది. దీంతో ఆయన్ను చంచల్ గూడ జైలుకు తరలించారు. అక్టోబర్ 3వ తేదీ వరకు జానీ మాస్టర్ కస్టడీలోనే ఉండనున్నారు. అయితే.. కోర్టులో హాజరుపర్చిన సమయంలో.. జానీ మాస్టర్‌పై పోలీసులు ప్రవేశపెట్టిన రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కోర్టు సమక్షంలో జానీ మాస్టర్ నేరం అంగీకరించినట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై తాను లైంగిక దాడికి పాల్పడినట్లు ఒప్పుకున్నట్టు పోలీసులు తెలిపారు. 2019లోనే బాధితురాలితో జానీ మాస్టర్‌కు పరిచయమైందని తెలిపారు. అయితే.. దురుద్దేశంతోనే.. ఆమెను అసిస్టెంట్‌గా చేర్చుకున్నట్టు వెల్లడించారు. కాగా.. 2020లో ముంబయిలోని ఓ హోటల్‌లో బాధితురాలిపై మొదటిసారి జానీ మాస్టర్ లైంగిక దాడికి పాల్పడినట్టు పేర్కొన్నారు. ఆ సమయంలో బాధితురాలి వయసు 16 సంవత్సరాలు మాత్రమేనని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు.

ఎంజీఎం ఆస్పత్రికి అత్యాధునిక పరికరాలు

వరంగల్ కలెక్టర్ సత్య శారద

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

అక్షరదర్బార్, వరంగల్ : ఎంజీఎం ఆస్పత్రికి అత్యాధునిక పరికరాలు అందించేందుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ముందుకు వచ్చిందని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంజీఎం సూపరింటెండెంట్ మురళీ, ఆర్ఎంవో మురళీ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమ్మయ్యతో కలెక్టర్ డాక్టర్ సత్యశారద పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎస్ఆర్ పనుల కింద వైద్య పరికరాల సరఫరా చేసేందుకు పవర్ గ్రిడ్ ముందుకు వచ్చిందని అందుకు జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. ఇందులో భాగంగా ఎంజీఎం ఆసుపత్రిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గల పరికరాల వివరాల నివేదికలు సమర్పించాల్సిందిగా ఎంజీఎం సూపరింటెండెంట్ మురళిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, పవర్గ్రిడ్ జూనియర్ ఇంజినీర్ సీహెచ్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్

చిన్నవయస్సులోనే సత్తా చాటుతున్న ఆకుతోట కార్తీకేయ

అక్షర దర్బార్,తొర్రూరు: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండల వాసి సత్తా చాటాడు. తాజాగా వరంగల్ లో తొమ్మిదవ జాతీయస్థాయి షోటో కాన్ కరాటే ఛాంపియన్ షిప్-24 పోటీల్లో మండలానికి చెందిన ఆకుతోట కార్తికేయ పాల్గొని ఆరెంజ్ బెల్ట్ కట్ ఆఫ్ విభాగంలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో జరిగే కరాటే పోటీల్లో పాల్గొని మళ్లీ గోల్డ్ మెడల్ సాధిస్తాడని కోచ్ యాకూబ్ పాష తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, కోచ్ యాకూబ్ పాషాను నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా తండ్రి ఆకుతోట సంతోష్ బాబు మాట్లాడుతూ.. చిన్నతనంలోనే పిల్లలకు కరాటేలో కోచింగ్ ఇవ్వడంతో ఆత్మరక్షణకు దోహద పడుతుందని, పాఠశాల స్థాయి నుంచే కరాటే పై శిక్షణ అవసరమని నిర్వాహకులు తెలిపారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

అక్షర దర్బార్,మహాదేవపూర్ : ఇటీవల ఆకస్మిక మరణం పొందిన బీజేపి మండల కార్యదర్శి మంథని రాజేందర్ కుటుంబానికి మహాదేవపూర్ వాస్తవ్యుడు హైదరాబాద్ లో నివాసం ఉంటున్న ఠాకూర్ మహేందర్ సింగ్ శుక్రవారం 75 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నిరుపేద కుంటుబానికి ఠాకూర్ మహేందర్ సింగ్ తన స్నేహితులు సంతోష్ సింగ్, మల్లికార్జున్ సహాయంతో తల్లిదండ్రులు ఠాగూర్ శంకర్ సింగ్, కమలాబాయి చేతులు మీదుగా ఆర్థిక సాయం అందింపజేశారు.

రేవంత్ రెడ్డికి బిగ్ రిలీఫ్

- ఓటుకు నోటు కేసులో ముఖ్యమంత్రికి ఊరట
- కేసును వేరే కోర్టుకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పిటిషన్ రిజెక్ట్

అక్షరదర్బార్, హైదరాబాద్ : ఓటుకు నోటు కేసులో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఊరట లభించింది. కేసును వేరే కోర్టుకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. రేవంత్ తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నందున ఈ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలన్న ఆయన విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ పిటిషన్‌పై విచారణను ముగించింది. "స్పష్టమైన ఆధారాలు లేకుండా ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ దాఖలు చేశారు. ట్రయల్ కోర్టు పారదర్శకంగా విచారణ చేపట్టాలి. విచారణ జరుగుతున్న దశలో జోక్యం చేసుకోలేం" అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ కేసును భోపాల్‌కు బదిలీ చేయాల్సిన అవసరం లేదని న్యాయస్థానం కుండబద్దలు కొట్టింది. విచారణ సందర్భంగా రేవంత్‌రెడ్డికి సుప్రీంకోర్టు పలు సూచనలు చేసింది. తమ తీర్పులపై అభిప్రాయం చెప్పే హక్కు అందరికీ ఉంటుందని.. ప్రజా జీవితంలో ఉన్నవారు ఆచితూచి మాట్లాడాలని పేర్కొంది. గతంలో చేసిన వ్యాఖ్యల విషయంలో రేవంత్‌రెడ్డి క్షమాపణలను సుప్రీంకోర్టు అంగీకరించింది. తెలుగు రాష్ట్రాల్లో రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసు అప్పట్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. గతంలో సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్‌పై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. రేవంత్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత ధర్మాసనం.. ఆ కేసు విచారణ పూర్తయ్యేవరకు సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ నిలిపివేయాలని తెలంగాణ ఏసీబీని ఆదేశించింది.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వోపా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజారావు

అక్షరదర్బార్, హన్మకొండ: విశ్వబ్రాహ్మణ విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ & ప్రొఫెషనల్ అసోసియేషన్ (వోపా) అధ్యక్షులు శ్రీరామోజు నాగరాజారావు కోరారు. ఈమేరకు హనుమకొండ రెడ్డికాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నాగరాజారావు మాట్లాడారు. వోపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కారాలకు 2024వ సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విశ్వబ్రాహ్మణ విద్యార్థినీ విద్యార్థులు అర్హులన్నారు. సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని, గడువు తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులు పరిశీలించబడవని అన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన కొంత మందిని ఎంపిక చేస్తామని, ఎంపిక తుది నిర్ణయం కమిటీకే ఉంటుందని తెలిపారు. పురస్కారాల తేదీ, వేదిక త్వరలో తెలుపుతామన్నారు. దరఖాస్తుతో పాటు SSC మెమో, కాస్ట్, కండక్ట్ సర్టిఫికెట్ కాపీ జత చేసి గడువులోగా పంపాలని కోరారు. ప్రతిభా పురస్కాలతోపాటుగా నగదు పురస్కారం కూడా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 9440313745, 9390121399, 9550151292 నంబర్లలో సంప్రదించాలని కోరారు.